సేవాతత్పరులు వలంటీర్లు

- 49వ వార్డులో ప్రజలకు నిస్వార్థంగా సేవలు
- సంక్షేమ పథకాల పంపిణీలో నిబద్ధత

వలంటీర్లకు వందనం

మురళీనగర్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన వలంటీర్ వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలిచింది. ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వలంటీర్లు వారధులుగా ఉంటూ సంక్షేమ పథకాల అమలుకు చిత్తశుద్ధితో పనిచేస్తున్నారు. పారదర్శకంగా ప్రభుత్వ పథకాలను, సేవలను ప్రజలకు చేరవేస్తూ సేవా దృక్పథాన్ని చాటుతున్నారు. గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్య స్థాపనకు వైఎస్ జగన్ ప్రభుత్వం చేస్తున్న నిరంతర కృషిలో వీరు కీలకంగా వ్యవహరిస్తున్నారు. వలంటీర్ వ్యవస్థ వల్ల ప్రభుత్వానికి మంచి పేరు రావడంతో ప్రతిపక్షాలు ఎన్నో కుట్రలు పన్నుతున్నాయన్న విషయాన్ని ప్రజలు గమనించారు. ఎవరెన్ని కుట్రలు పన్నినా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పరిపాలన చరిత్రాత్మకమని లబ్ధిదారులు కొనియాడుతున్నారు.

జీవీఎంసీ 49వ వార్డులో వలంటీర్లు ప్రజలతో మమేకమై వారి సమస్యలు తెలుసుకుంటూ వాటి పరిష్కారానికి కృషి చేస్తున్నారు. వార్డులోని సచివాలయం–285 వలంటీర్లు నిబద్ధతతో పనిచేస్తున్నారు. లబ్ధిదారులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు, సేవలు అందించడంలో విశేష కృషి చేస్తున్నారు.

కష్టాలు తెలుసుకుంటున్నారు


కర్రి అప్పారావుకు పింఛన్ అందిస్తున్న వలంటీర్ బుక్కా దేవిక(ఫైల్)

వలంటీర్లు, సచివాలయ వ్యవస్థ వచ్చిన తర్వాత మా కష్టాలను చెప్పుకోవడానికి ఒక అవకాశం కలిగింది. గతంలో ఏదైనా సమస్య చెప్పాలంటే అధికారుల చుట్టూ తిరగాల్సి వచ్చేది. ఇప్పుడు వలంటీర్లే నేరుగా మా ఇళ్లకు వచ్చి సమస్యలను తెలుసుకుని అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకువెళ్తున్నారు. దీంతో మాకు మేలు జరుగుతోంది. నాలాంటి లబ్ధిదారులకు ప్రతి నెలా ఒకటో తేదీనే ఇంటికి వచ్చి పింఛన్లు అందిస్తున్నారు. గొప్ప సేవలు అందిస్తున్న వలంటీర్లను కొందరు నాయకులు విమర్శించడం తగదు.

– కర్రి అప్పారావు, ఎన్‌జీజీవోస్ కాలనీ

ఒకటో తేదీనే పింఛన్ అందుకుంటున్నా..


ఎన్.లావణ్యకు పెన్షన్ నగదు అందిస్తున్న వలంటీర్ జె.అన్నపూర్ణ(ఫైల్)

వలంటీర్ల సేవలకు విలువ కట్టలేం. ప్రతి నెలా ఒకటో తేదీనే మా ఇంటికి వచ్చి పింఛన్ సొమ్ము అందిస్తారు. మా యోగక్షేమాలు అడిగి తెలుసుకుంటారు. మా కుటుంబ సభ్యులు మాదిరిగా మా కష్టాలను అడిగి వాటి పరిష్కారానికి కృషి చేస్తున్నారు. ఈ వ్యవస్థ ఎంతో బాగుంది. పెన్షన్ ఎప్పుడిస్తారో, ఎవరి దగ్గరికి వెళ్లాలో తెలియని పరిస్థితి నుంచి ఒకటో తేదీ నాటికి ఇంటికే పింఛన్ వస్తుందనే భరోసా కల్పించారు. వలంటీర్ వ్యవస్థ ప్రవేశపెట్టిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మా కృతజ్ఞతలు తెలుపుతున్నాం.

– ఎన్.లావణ్య, బర్మా కాలనీ, 49వ వార్డు

ఇంటికి వచ్చి సేవలందిస్తున్నారు


దేవిపల్లి ఆంథోనమ్మకు పింఛన్ అందిస్తున్న వలంటీర్ బి.గంగాభవాని(ఫైల్)

ప్రజాస్వామ్య పరిపాలనలో వలంటీర్ల వ్యవస్థను ఒక చరిత్రగా చెప్పవచ్చు. నాకు ఒకటో తేదీ వేకువజామునే మా ఇంటి తలుపుతట్టి పింఛన్ అందిస్తున్నారు. గతంలో అధికారుల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి. ఇప్పుడు వలంటీర్లే ఇంటికి వచ్చి మా అర్హతను బట్టి సంక్షేమ పథకాలకు దరఖాస్తు చేయిస్తున్నారు. ఇంతకన్నా గొప్ప సౌకర్యం మరొకటి ఉండదు. నిరక్షరాస్యులైన వారికి వలంటీర్ల సేవలు చాలా అవసరం. దరఖాస్తులు రాయడమే రాని వారికి వారే స్వయంగా ఇంటికి వచ్చి వాటిని రాసి పథకాల మంజూరుకు అధికారులకు పంపిస్తారు. వలంటీర్ల సేవలు ఎంతో గొప్పవి.

– డి.ఆంథోనమ్మ, నెహ్రూ నగర్

షిర్డీసాయిని దర్శించుకున్న జిల్లా జడ్జి


జిల్లా జడ్జి శ్రీహరి దంపతులను సత్కరిస్తున్న నూకల శేషగిరిరావు

తాటిచెట్లపాలెం: రైల్వే న్యూకాలనీ రైల్వే ఎగ్జిబిషన్ గ్రౌండ్స్ ఎదురుగా గల షిర్డీసాయిబాబా ధ్యాన మందిరంలో ఆదివారం జిల్లా జడ్జి మహదాస్ శ్రీహరి దంపతులు పూజలు చేశారు. సాయిబాబాను దర్శించి, నూతన వస్త్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా ధ్యాన మందిర వ్యవస్థాపక అధ్యక్షుడు నూకల శేషగిరిరావు వీరి కోసం ప్రత్యేక పూజలు నిర్వహించి, తీర్థప్రసాదాలు అందించారు. అనంతరం జడ్జి దంపతులను శాలువాతో సత్కరించి, బాబా ఫొటోను బహూకరించారు.

నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు


రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న ద్వారకా సీఐ సింహాద్రి నాయుడు


ఫోర్త్‌టౌన్ పీఎస్‌లో రౌడీషీటర్లకు సూచనలిస్తున్న సీఐ శ్రీనివాసరావు

సీతమ్మధార: ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్ ఆవరణలో ఆదివారం రౌడీషీటర్లకు సీఐ శ్రీనివాసరావు కౌన్సెలింగ్ నిర్వహించి, వేలిముద్రాలు సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎటువంటి నేరానికి పాల్పడినా కఠిన చర్యలు తప్పవని రౌడీషీటర్లను హెచ్చరించారు. సమాజంలో ఎలాంటి అల్లర్లు, గొడవలు చేయకుండా సత్ప్రవర్తనతో మెలగాలని సూచించారు. పోలీస్ నిఘా ఎల్లప్పుడూ ఉంటుందని గుర్తుంచుకుని మంచిగా నడుచుకోవాలని సీఐ హితవు పలికారు. పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

ద్వారకా జోన్ పీఎస్‌లో..

ద్వారకా జోన్ పోలీస్ స్టేషన్‌లో రౌడీషీటర్లకు సీఐ సీహెచ్.సింహాద్రినాయుడు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తగాదాలు, కొట్లాటల్లో తల దూర్చకుండా కుటుంబ సభ్యులతో కలిసి హాయిగా జీవించాలని సూచించారు. రౌడీషీటర్ల దినచర్యపై ఆరా తీశారు. అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవని సీఐ హెచ్చరించారు.

అపూర్వ కలయిక.. ఆనంద వేడుక


టెక్కలి జూనియర్ కళాశాల 1980-82 బ్యాచ్ విద్యార్థుల సందడి

సీతమ్మధార: హలో గోవింద్ ఎలా ఉన్నావ్.. హాయ్ లక్ష్మి బాగున్నావా.. ఇప్పుడు ఏం చేస్తున్నావ్.. అంటూ పూర్వ విద్యార్థులు దాదాపు 41 ఏళ్ల తరువాత కలుసుకుని ఆప్యాయంగా ఒకరినొకరు పలకరించుకున్నారు. నగరంలోని ఓ హోటల్ వీరి అపూర్వ కలయికకు వేదికైంది. శ్రీకాకుళం జిల్లా టెక్కలి ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన 1980–82 బ్యాచ్ ఇంటర్మీడియట్ విద్యార్థులు ఆదివారం వీఐపీ రోడ్డులోని ఒక హోటల్‌లో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. స్కూల్, కళాశాలలో చదువుకున్న రోజులను, పాత జ్ఞాపకాలను నెమరు వేసుకుని ఎవరు ఏ వృత్తిలో స్థిరపడ్డారో మొదలగు విషయాలను పంచుకున్నారు. కోల్‌కతా, హైదరాబాద్, చెన్నైతోపాటు శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, విజయవాడ తదితర మహా నగరాలు, ప్రాంతాల నుంచి పూర్వ విద్యార్థులు తరలివచ్చారు. మహిళలు పాటలు పాడి సందడి చేయగా.. మగవారు డ్యాన్స్‌లు వేసి జోక్స్ చెబుతూ అందరినీ నవ్వించారు. అలనాటి విద్యార్థులు రోజంతా కబుర్లు చెప్పుకుని ఆనందంగా గడిపారు.

దర్యాప్తు వేగవంతం

సీతమ్మధార: హాస్టల్ మేడపై నుంచి విద్యార్థిని పడిపోయిన సంఘటనపై ఫోర్త్‌టౌన్ సీఐ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో దర్యాప్తు వేగవంతంగా సాగుతోంది. దొండపర్తి నెహ్రూ బజార్ సమీపంలోని ఒక హాస్టల్ మూడో అంతస్తు పైనుంచి శనివారం రాత్రి ఇంటర్మీడియట్ విద్యార్థిని పడిపోయిన విషయం తెలిసిందే. ఈ ఘటనపై హాస్టల్ నిర్వాహకులు, విద్యార్థిని చదువుతున్న కళాశాల నిర్వాహకులను ఆదివారం పోలీస్ స్టేషన్‌లో విచారించారు. అసలు ఏం జరిగింది, ఎందుకు విద్యార్థిని మేడపై నుంచి కింద పడిపోవాల్సి వచ్చింది అన్న కోణంలో దర్యాప్తు చేశారు.

క్లుప్తంగా

ఘనంగా కొత్త మహాలక్ష్మి పండగ


ప్రత్యేక అలంకారంలో అమ్మవారు

మద్రిపాలెం: జీవీఎంసీ 50వ వార్డు మాధవధారలో కొలువైన కొత్త మహాలక్ష్మి అమ్మవారి పండగ ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో వేకువజామున 5 గంటల నుంచి ప్రత్యేక పూజలు చేశారు. పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని పూజలు జరిపారు.

ఎర్నిమాంబకు ప్రత్యేక పూజలు


అమ్మవారికి హారతి సమర్పిస్తున్న పూజారమ్మ

కంచరపాలెం: జీవీఎంసీ 41వ వార్డు జ్ఞానాపురం పరిధి కాన్వెంటు కూడలిలో వెలసిన ఎర్నిమాంబ అమ్మవారి ఆలయం ఆషాఢ శుద్ధ చతుర్దశి ఆదివారాన్ని పురస్కరించుకుని భక్తులతో కిటకిటలాడింది. ఆలయ పూజారమ్మ వాసుపల్లి విజయమ్మ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ ప్రధాన అర్చకుడు పులఖండం శ్రీకాంత్‌శర్మ ఉదయం నుంచి అమ్మవారికి కుంకుమ పూజలు, విశేషార్చనలు, అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ప్రత్యేక ఉచిత దర్శనాలు ఏర్పాటు చేశారు. ఆలయ పరిసరాల్లో భక్తులు వంటా వార్పు చేసుకున్నారు. దేవదాయ శాఖ ఈవో డీవీఎస్ సురేష్‌బాబా, ఆలయ సిబ్బంది భక్తుల సౌకర్యాలను పర్యవేక్షించారు.

బైక్ ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలు

మద్రిపాలెం: కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ వ్యక్తి రోడ్డు దాటుతుండగా తీవ్ర గాయాలైన ఘటన జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. గాజువాక బీసీ కాలనీకి చెందిన బి.రాము శనివారం రాత్రి బిర్లా కూడలి వైపు నుంచి ఊర్వశి వైపు ఆటోలో వస్తున్నాడు. ఆ క్రమంలో బిర్లా జంక్షన్ దాటాక ఆటో దిగి రోడ్డు దాటుతున్న క్రమంలో బైక్‌పై ఒక్కసారిగా వచ్చిన ఓ వ్యక్తి రాముని ఢీకొనడంతో అతడికి తీవ్ర గాయాలై రెండు కాళ్లు విరిగిపోయాయి. వెంటనే క్షతగాత్రుడిని సమీపంలో ఉన్న ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ఆదివారం రాత్రి బాధితుడు రాము ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీఐ ఎస్.సాయి నేతృత్వంలో ఏఎస్‌ఐ ఆదిరాజు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నాగసూరితో ఇష్టాగోష్టి


డాక్టర్ నాగసూరి వేణుగోపాల్ దంపతులను సత్కరిస్తున్న గాంధీ సెంటర్ ప్రతినిధులు

సీతంపేట: గాంధీ సెంటర్, విశాఖ రచయితల సంఘం సంయుక్తంగా ఆదివారం డాక్టర్ లంకపల్లి బుల్లయ్య కళాశాలలోని సంస్థ కార్యాలయంలో ఆకాశవాణి రిటైర్డ్ సంచాలకుడు డాక్టర్ నాగసూరి వేణుగోపాల్‌తో ఇష్టాగోష్టి కార్యక్రమం నిర్వహించింది. నాగసూరిని సభాధ్యక్షుడు ఆచార్య వి.బాలమోహన్‌దాస్ సభకు పరిచయం చేశారు. ఈ సందర్భంగా నాగసూరి మాట్లాడుతూ గాంధీజీ సిద్ధాంతాన్ని వివరించారు. ప్రస్తుత సమాజానికి దాని అవసరాన్ని తెలిపారు. అనంతరం నాగసూరి దంపతులను సత్కరించారు. కార్యక్రమంలో విశాఖ రచయితల సంఘం కార్యదర్శి అడపా రామకృష్ణ, రచయిత డి.వి.సూర్యారావు, న్యాయవాది తాళ్లూరి సుగుణ, శాస్త్రి, మేడా మస్తాన్‌రెడ్డి, నరవ ప్రకాశరావు, రాయప్రోలు సుబ్రహ్మణ్యం, చిన చూరి, గాంధీ సెంటర్ సభ్యులు పాల్గొన్నారు.

ఆసక్తికరంగా చదరంగం పోటీలు


పోటీ పడుతున్న చిన్నారులు

విశాఖ స్పోర్ట్స్: ప్రపంచ చదరంగం దినోత్సవం సందర్భంగా ఆదివారం మద్దిలపాలెం వైజాగ్ చిల్డ్రన్స్ క్లబ్ ఆధ్వర్యంలో చదరంగం పోటీలు నిర్వహించారు. 56 మంది చిన్నారులు ఉత్సాహంగా పాల్గొని ఎత్తులకు పైఎత్తులు వేసి ప్రతిభ చూపారు. ఆసక్తికరంగా సాగిన ఈ పోటీల్లో ఆరుగురేసి చొప్పున తొలి రెండు స్థానాల్లో నిలిచిన వారికి రొటేరియన్ మోదాంబిక సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో మణి, జగదీష్, నిఖిల్ పాల్గొన్నారు.

ఉత్సాహంగా స్టోరీ టెల్లింగ్


బొమ్మల తయారీ చూపిస్తున్న శ్రీకరుణ

సీతంపేట: ద్వారకానగర్ పౌర గ్రంథాలయం మియావాకీ సెక్షన్‌లో ఆదివారం స్టోరీ టైం కార్యక్రమం నిర్వహించారు. స్టోరీ టెల్లర్ శ్రీకరుణ ఆసక్తికరమైన కథలు వినిపించారు. 1 నుంచి 4 తరగతి విద్యార్థులు, ఆ తర్వాత 5 నుంచి 8 తరగతి విద్యార్థులకు వేర్వేరుగా కథలు చెప్పారు. అనంతరం కాగితాలతో బొమ్మల తయారీ(ఓరిగామి)పై పిల్లలకు శిక్షణ ఇచ్చారు. బొమ్మల ద్వారా కథలు చెప్పారు. సుమారు 70 మంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమాన్ని పౌర గ్రంథాలయం, భారతీయ విద్యాభవన్ స్కూల్ కలిసి సంయుక్తంగా నిర్వహించాయి.

కాలుష్య నియంత్రణకు మొక్కలు నాటుదాం


పోర్టు స్టేడియంలో మొక్కలు నాటుతున్న వాకర్స్

సీతంపేట: అక్కయ్యపాలెం పోర్టు స్టేడియంలో ప్రతి రోజూ వాకింగ్ చేస్తున్న వాకర్స్ అసోసియేషన్‌గా ఏర్పడ్డారు. ఆదివారం వారంతా సమావేశమయ్యారు. సామాజిక బాధ్యతగా సభ్యులందరూ కలిసి ఉదయం 200 మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాలుష్యాన్ని నివారించాలంటే ప్రతి ఒక్కరూ ఒక మొక్కను నాటాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలోఅసోసియేషన్ అధ్యక్షుడు ఎస్.ప్రసాదరావు, కార్యదర్శి వి.విఠల్‌రావు, కోశాధికారి ఎం.తిలక్ పట్నాయక్, కమిటీ సభ్యులు, వాకర్స్ పాల్గొన్నారు.

వానప్రస్థ వృద్ధాశ్రమంలో సేవా కార్యక్రమం



వృద్ధులకు మధ్యాహ్న భోజనం వడ్డిస్తున్న అల్లు శంకరరావు యువసేన

మురళీనగర్: జీవీఎంసీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, 49వ వార్డు కార్పొరేటర్ అల్లు శంకరరావు పుట్టిన రోజు వేడుకలను ఆదివారం ఆయన అభిమానులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, యువకులు ఘనంగా నిర్వహించారు. శంకరరావు తిరుపతిలో ఉన్నందున అభిమానుల ఆధ్వర్యంలో పట్టాభిరెడ్డితోటలోని పార్టీ కార్యాలయంలో కేక్ కట్‌చేసి ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పట్టాభిరెడ్డితోట వానప్రస్థ వృద్ధాశ్రమంలోని వృద్ధులకు అల్లు శంకరరావు యువసేన ఆధ్వర్యంలో మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర భట్రాజుల డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ ఎన్.రవికుమార్, విశాఖ వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఐ.రవికుమార్, శివాలయం బోర్డు చైర్మన్ ఎస్.వెంకటరమణ, వార్డు సీనియర్ నాయకులు పి.రవికుమార్, జె.వెంకటరావు, ఎస్.చంద్రశేఖర్, బి.శివరామప్రసాద్, సీహెచ్.శ్రీను, ఎల్.సుధాకర్, ఆర్.చిన్నారావు, జి.రామకృష్ణ, పి.నాగరాజు, కె.మున్నా, బి.శంకర్, హెచ్.అశోక్, పి.చైతన్య, సీహెచ్.నర్సింగ్, ఎ.గణేష్, నాయుడు, రాంబాబు, సంతోష్, మహిళా సీనియర్ నాయకులు వి.కమల కుమారి, బి.శకుంతల, మంగ పాల్గొన్నారు.

దంత వైద్య శిబిరానికి విశేష స్పందన


దంత పరీక్షలు చేస్తున్న వైద్యులు

సీతంపేట: లెట్స్ స్పీక్ ఇన్‌స్టిట్యూట్ ఆధ్వర్యంలో ఆదివారం రామాటాకీస్ రోడ్‌లోని సంస్థ కార్యాలయం వద్ద నిర్వహించిన ఉచిత దంత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. సుమారు 200 మంది రోగులను అనిల్ నీరుకొండ ఆస్పత్రి వైద్యులు శివకుమార్, శ్రీనివాసరావు, పీజీ వైద్యులు ప్రహర్ష, సాయి, శ్రీయ, కల్యాణి, నందిని, మౌనిక, భరణ తదితరులు పరీక్షించి వైద్య సేవలు అందించారు. అవసరమైన వారికి అక్కడ చికిత్స నిర్వహించారు. వీలు కాని వారికి అనిల్ నీరుకొండ ఆస్పత్రికి తమ బస్సుల్లో తీసుకువెళ్తామని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో లెట్స్ స్పీక్ ఇన్‌స్టిట్యూట్ మేనేజింగ్ డైరెక్టర్ సురేంద్ర, సంతోష్, శ్రీధర్, పూర్ణిమ పాల్గొన్నారు.

రంగస్థల కళాకారుడు సీతారామరెడ్డి మృతి


సీతారామరెడ్డి(ఫైల్)

కంచరపాలెం: జీవీఎంసీ 55వ వార్డు కొత్తరెడ్డి కంచరపాలేనికి చెందిన రంగస్థల కళాకారుడు మద్ది సీతారామరెడ్డి(73) ఆదివారం తన నివాసంలో కన్నుమూశారు. ఆయన మృతి రంగస్థలానికి తీరని లోటని పలువురు కళాకారులు సంతాపం తెలిపారు. సీతారామరెడ్డి భౌతిక కాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులను స్థానికులు, పలువురు కళాకారులు పరామర్శించి, ధైర్యంగా ఉండాలని ఓదార్చారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న ప్రధాన కార్యదర్శి లలిత

దాబాగార్డెన్స్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అంగన్‌వాడీ సంఘాల నాయకులతో చర్చించి అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ (ఏఐటీయూసీ అనుబంధ సంస్థ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జె. లలిత కోరారు. అసోసియేషన్ విశాఖ, విజయనగరం ఉమ్మడి జిల్లాల సదస్సు ఆదివారం అల్లిపురంలోని నీలం రాజశేఖర్‌రెడ్డి భవన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు అతి తక్కువ గౌరవ వేతనాలకు పనిచేస్తూ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు విజయవంతం చేసేందుకు నిత్యం గ్రామీణ, పట్టణ నిరుపేద కుటుంబాలు, గర్భిణులు, బాలింతలకు, సున్నా నుంచి ఆరేళ్ల పిల్లల వరకు సేవలందిస్తున్నారని చెప్పారు. అంగన్‌వాడీల సమస్యలపై సీఎం వైఎస్ జగన్ అసోసియేషన్లను ఆహ్వానించి, చర్చించి మంచి వేతనాలు, ఈఎస్ఐ, పెన్షన్, ఇన్సూరెన్స్ అమలు చేయాలని, విధుల్లో చనిపోయిన వారికి రూ.5 లక్షలు, వారి ఇంటిలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ విజయనగరం జిల్లా నాయకుడు డేగల అప్పలరాజు, మహిళా సమైక్య జిల్లా అధ్యక్షురాలు బేగం తదితరులు పాల్గొన్నారు.

రెండు జిల్లాల నూతన కమిటీ..

సమావేశం అనంతరం విశాఖ, విజయనగరం ఉమ్మడి జిల్లాల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. విశాఖ జిల్లా అధ్యక్షురాలిగా అనిత, ఉపాధ్యక్షురాలిగా వెంకటలక్ష్మి, ప్రధాన కార్యదర్శిగా అనురాధ, సహాయ కార్యదర్శిగా అరుణ, కోశాధికారిగా నరసయ్యమ్మ, కమిటీ సభ్యులుగా కుమారి, విజయ, కొండమ్మ, సీతను ఎన్నుకున్నారు. విజయనగరం జిల్లా గౌరవ అధ్యక్షుడిగా ఈగల అప్పలరాజు, అధ్యక్షురాలిగా రమణి, ఉపాధ్యక్షురాలిగా మణి, కార్యదర్శిగా మాణిక్యం, సహాయ కార్యదర్శిగా సుశీల, కోశాధికారిగా రమణ, సభ్యులుగా కుమారి, సరోజిని, యశోద, కనకమహాలక్ష్మి, హైమావతి తదితరులను ఎన్నుకున్నారు.

సీతమ్మధార రైతుబజార్‌లో తనిఖీలు


రైతులు, స్టాళ్ల వివరాలు తెలుసుకుంటున్న వ్యవసాయ, మార్కెటింగ్ అధికారి యాసిన్

సీతమ్మధార: స్థానిక రైతు బజార్‌లో ఆదివారం జిల్లా వ్యవసాయ, వాణిజ్య, మార్కెటింగ్ శాఖ అధికారి ఎస్.కె.యాసిన్ ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ప్రతి స్టాల్ వద్దకు వెళ్లి రైతుల ఐడీ కార్డులు పరిశీలించి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుబజార్‌కు వచ్చే వినియోగదారులకు నాణ్యమైన సేవలందించాలని సూచించారు. సబ్సిడీపై విక్రయిస్తున్న కందిపప్పు, బియ్యం కౌంటర్లను పరిశీలించారు. యాసిన్ వెంట రైతుబజార్ ఈవో పి.కొండబాబు, సహాయకుడు సతీష్ ఉన్నారు.

అభాగ్యుడికి వైద్య సేవలు



చికిత్స పొంది డిశ్చార్జి అయిన తర్వాత అమరేష్

దాబాగార్డెన్స్: ఓ అభాగ్యుడు. పేరు తెలియదు. ఊరు ఎక్కడో? మాట్లాడడం లేదు. వయస్సు సుమారు 50 ఏళ్లు ఉంటాయి. గెడ్డం పెరిగి.. చూడడానికి భయంకరంగా ఉన్నాడు. గత కొంత కాలంగా నగరంలోని సంగం శరత్ థియేటర్ ఎదురుగా ఉన్న ఫుట్‌పాత్ పైనే ఉంటున్నాడు. ఎవరో కాసింత ముద్ద పెడితే తిని నిద్రిస్తున్నాడు. సమీపంలో గల ఏయూటీడీ స్వచ్ఛంద సంస్థ సిబ్బంది వారం రోజులుగా ఆ అభాగ్యుడ్ని గమనించారు. ఈ ఏడాది ఏప్రిల్ 20న రెస్క్యూ నిర్వహించి ప్రభుత్వ మానసిక వైద్యశాల(మెంటల్ ఆసుపత్రి)కు తరలించారు. అక్కడ మంచి వైద్యం అందించారు. రికవరీ అయ్యాడు. పేరు అమరేష్ అని చెప్పాడు. పూర్తిగా మానసిక వ్యాధి నుంచి కోలుకున్న అమరేష్‌ను డిశ్చార్జి చేశారు. కాంప్లెక్స్ సమీపాన గల ఏయూటీడీ నిరాశ్రయుల వసతి గృహంలో ఆశ్రయం కల్పించారు.

IN THE HONOURABLE COURT OF III ADDITIONAL JUNIOR CIVIL JUDGE AT: VISAKHAPATNAM
O.S. 3/2021

Between:
Sri. Kosuru sita Rama Raju, S/o. Late Rama Raju, Hindu Aged 74 Years residing at Flat No. 14/16, Tower B, Lansum Oxygen Towers, Seethammadhara, Visakhapatnam ...Plaintiff
And
Sri. Chintala Satyanarayana & another ...Defendants

To,
1) Sri Chintala Satyanarayana, S/o. Atchaiah, Residing at D.No.45-1-1/5/1, Muslim thatichetlapalem, Visakhapatnam.
2) Sri Chintala Naga Jagadish, S/o. Satyanarayana, Residing at D.No.45-1-1/5/1, Muslim Thatichetlapalem, Visakhapatnam. ...Defendants

NOTICE OF SUMMONS

Take notice that the Plaintiff filed this suit for recovery of Rs. 18,62,500/- basing on the demand promissory note executed by you, therefore you are required to attend before the Court at 10-30 a.m on 14-08-2023 either in person or through your counsel to submit your objections, else the suit will be decided in your absence.

Hg : 14-08-2023

(By Order of the Honourable Court)
N.SAI KRISHNA, Advocate
D.No. 53-17-51/3, Maddilapalem, Visakhapatnam-13. Ph : 8143261769